స్కెచ్

# తెలియని బాట

శింగీతం శ్రీనివాసరావు

బయట రావిచెట్టు చిన్నగాలికి సైతం ఎక్కువ చప్పుడు చేస్తూంది,-(వ్యతిరేక పక్షంలో ఉండే చిన్న రాజకీయవేత్తలాగా) గడియారం ముళ్ళ వైపు చూశాడు గోపాలం నిద్రలేస్తూ. నాలుగు గంటలై ఐదు నిముషాలైంది. ముళ్ళ మధ్య కోణం ఎంత ఉంటుందా అని ఆలోచించాడు. వేరేవేరే వేగాలతో వెళ్ళే రెండు ముళ్ళ మధ్య కోణం లెక్కపెట్టేదెంత కష్టం? అదే విధంగా వేరేవేరే మనస్తత్వాలతో, మానసిక బలాలతో సమాజాన్ని, రూపించే మానవులమధ్య అంతర్యాన్ని. ఆ అంతర్యంవల్ల ప్రస్తుత ప్రపంచంలో కలిగిన మార్పుల్ని తర్కిస్తూ లేచాడు. తిన్నగా పక్క చుట్టాడు. ముఖం కడుక్కోవడం, తల దువ్వుకోవడం, గదితలుపు తాళం వెయ్యడం—— అన్నీ సాధారణంగానే జరిగిపోయాయి. కాఫీ త్రాగటానికి హోటల్ వైపు వెళ్ళాడు.

"కాఫీ" అని తనకు తెలియకుండానే అనేశాడు. ఎవరో ఇద్దరు యువకులువచ్చి తన టేబిల్ వద్దనే కూర్చున్నాడు. అందులో ఒకడు రాజకీయ పార్టీలనుగూర్చి ఉద్ఘాటిస్తున్నాడు. ఒక పార్టీ ఒకప్పుడు ఒకవిధంగా మాట్లాడిందనీ, దాన్ని మరొక పార్టీ ఇప్పుడు ఖండించిందనీ, దాంతో మొదటి పార్టీవారు తెల్లమొఖాలేస్తే, ఒక నాయకుడు వాళ్ళను పురికొల్పి తర్కించితే లాభం లేదని, కొట్లాటకు వచ్చాడని—ఇంకా—ఇంకా.

సర్వర్ కాఫీ తెచ్చాడు. వేడిగా ఉంటే ఆర్పను మొదలెట్టాడు గోపాలం. వచ్చిన యువకుల అవివేకానికి ఆశ్చర్యపోలేదు. ఆశ్చర్యం ఎందుకు? ఒక్క అక్షరము కూడా చదవకుండా, దీర్ఘంగా ఆలోచించకుండా, కొద్ది జ్ఞానంతో, ఎక్కువ అనుభవముందనే కృత్రిమమైనభావంతో తక్కువ తరగతి మనుష్యులకు (మానసికంగా)అనుకూలంగా మాట్లాడే గొప్ప రాజకీయవేత్తలే అలా ఉండగా ఈ యువకులు ఒకలెక్కా? "సమాజాన్ని బాగుపరచవలెననే మిషతో సదుపయోగకరమైన పనులుచేసే వాళ్ళను చెడిపి వాళ్ళను కూడా పని లేక తిరిగేవాళ్ళుగా, మాటకారులుగా చేసేటటువంటి మాటకారులు, పనిలేక తిరిగే వాళ్ళపై నాకేమాత్రం కనికరం లేద"నే బెర్నార్డ్ షా మాటలు స్ఫురణకు వచ్చాయి.

కాఫీ అయిపోయింది. బిల్ అంతకు ముందే ఒక నీటిబొట్టుకు అంటించిపెట్టి ఉండినాడు సర్వర్. బిల్ తీసుకొని వెళ్ళబోతుంటే ఎవరో భుజం మీద చెయ్యివేసి కూర్చోబెట్టారు, ఆ ప్రక్కకు తిరిగి చూచాడు రామనాథాన్ని.

"నిద్రపోయినట్టుందే" అన్నాడు రామనాథం మళ్ళీ జన్మించిన షెర్లాక్ హోమ్స్ లాగా..

"అబ్బ-ఏం ఎండ ఈరోజు! అయినా నువ్వు ఎట్లా మేల్కొన్నావో గాని——"

"ఆ-నాలుగు రోజులైందొక పుస్తకం మొదలెట్టి. ఇంకా చదువుతూనేవున్నా. అసలు (సర్వరుతో) కూల్ డ్రింక్ (మళ్ళీ గోపాలంతో)— ఏమిటీ ఏమో చెప్పాలనుకొని మరచిపొయ్యా— ఆ ఆ పుస్తకాల మాటకొస్తే అవి చదువుతూంటే యెంతైనా కాలం వెళ్ళిపోతుంది."

"అయితే కాలం వెళ్లబుచ్చటానికేనా పుస్తకాలు చదివేది?"

"అటువంటి పుస్తకాలు అటువంటి చదువు కాదు నేననేది"——కూల్ డ్రింక్ చల్లదనానికి మనసులో సంతోషించాడు. "మరీ పిచ్చి కథలుగా కాక, వాస్తవికమై శాస్త్రీయమైన భావాలు కలిగినటువంటి పుస్తకాలు. మెకాలే అన్నట్టు—"

"అదిగో. అదే వచ్చిన అపాయకరమైన కష్టం" తన స్వతంత్రభావాలకు తనే ఆశ్చర్యపోయాడు గోపాలం. "పుస్తకాలు చదవటంకన్న దీర్ఘంగా ఆలోచించటం ముఖ్యం. లేకపోతే "వాళ్ళన్నట్టు", "వీళ్ళన్నట్టు" అనే భావాలనే మన భావాలనే దురహంకారంతో జీవిస్తాం."

"ఏమీ చదవకుండా ఆలోచించటం అపాయ కరం. అసలు దుర్లభం" రామనాథం కూల్ డ్రింక్ పూర్తిఅయింది. రేడియోలో పాశ్చాత్య సంగీతం వినబడ్తూంది. అప్పుడే అయిపోయిన మోజార్ట్ సంగీతాన్ని వినేవాళ్ళే లేరు.

గోపాలం లేచాడు. "పుస్తకాలు చదవవద్దని ఎప్పుడూ చెప్పను. కాని చదివిందంతా నిజమని అనుకునే బానిసత్వపు మనస్తత్వం వద్దంటాను."

వీధిలోకి వచ్చారిద్దరు. ఎంతమందో తిరుగు తున్నారు. ప్రతి ఒక్కరు ఒక నియమిత అంతస్తు కన్న పైకిపోలేదు. అంటే అందరు మనస్తత్వంలో బానిసలేనా? గోపాలం ఆలోచించాడు. అది తన అహంకారమా? కాదుకాదు, తను వాస్తవికతను చూడగలిగాడు అంతే. హాస్టల్ మేడ మెట్లెక్కు తున్నారు.

"మా రూంకు పోయివస్తాంరా" అన్నాడు రామనాథం. పరధ్యానంగా రామనాథం వెనుక వెళ్ళేడు. దారిలో ఎవరో పిలిచారు. విధిలేక గోపాలం, రామనాథం ఇద్దరు సూర్యుడి గది లోకి దూరారు.

"రండి, రండి," ఆహ్వానించాడు సూర్యుడు. అతనొక గొప్ప కళాపిపాసి. ఆ సంగతి ఎంత మందికి చెప్పినా ఎవ్వరూ వినరు. విని అర్థం చేసు కునే కేపేసిటీ వాళ్ళకులేదని సూర్యుడి ఉద్దేశ్యం. ఒక కవరులోనుంచీ ఏడెనిమిది చిత్రాలు బయ టకు తీసాడు. ముప్పాతికభాగం చిత్రాలు అన్నీ సిటిరంగుతోనే వెయ్యబడినవి. కొన్ని మాత్రం నల్ల సిరా కలంతో చిత్రింపబడినవి. ఒక చిత్రాన్ని పైకి తీశాడు.

"దీని పేరు అలంకారం"అన్నాడు సూర్యుడు. గోపాలం, రామనాథం చూశారు. చాల కష్టపడి చిత్రించినట్లుగానే తోచింది. "మనదేశపు ఆధ్యా త్మికత్వాన్ని, పాశ్చాత్యుల వాస్తవికత్వాన్ని సమన్వయించాలని నా ఉద్దేశ్యం" అన్నాడు సూర్యుడు. "ఉద్దేశ్యాలు గుర్రాలైతే ముష్టివారు కూడా స్వారిచేస్తా"రనే షేక్స్పియర్ మాటలు గుర్తుకొచ్చాయి. రామనాథానికి. దాని మీద దీర్ఘంగా ఆలోచించాడు గోపాలం.

"ఈ చిత్రంలో"మొదలుపెట్టాడు గోపాలం. "అలంకరించుకొనే కన్యయొక్క అమాయకమైన సిగ్గు, అలంకరించే అమ్మాయియొక్క కళాభిమా నంలో కూడుకొన్న ఉత్సాహం, మొత్తంమీద ప్రతిబింబించే సాధారణత్వము,"—ఇంకా-ఇంకా కాని అందులో ఒక్కటికూడా కనుపించ లేదు గోపాలానికి. చటుక్కున గోడమీద ఏదో అగు పడింది.

"ఎవరు వ్రాసిందది?" అని అడిగాడు పరీ క్షిస్తు సూర్యుడు కూర్చున్నట్లుగానే తిరిగి దాన్ని చూచాడు. చూట్టానికది పిచ్చిగీతలమాదిరి ఉంది. ఎవరో ఒక ఎద్దును వెయ్యాలనుకొని, ఎలాగోవేసి కింద తన పేరుకూడా వ్రాసుకొన్నాడు.

"అంతకుముందిక్కడ ఉన్న వాడెవరో వ్రాశాడు"అన్నాడు సూర్యుడు నిర్లక్ష్యంగా.

గోపాలం బాగాపరీక్షించాడు. చిత్రాన్ని— కాదు. పిచ్చి గీతల్ని. పిచ్చిగీతలైనప్పటికీ ఎద్దులో ఉండే సహజ పౌరుషత్వం, మానవుని కాఠిన్యం వల్ల, మోసంవల్ల కలిగినటువంటి నిరుత్సాహం, తన జాతికి ఈక్వల్ రైట్స్‌కోసం పోరాడలేని దుస్థితికి చింత—ఈ భావాలన్నీ ఎవరూ చెప్ప కుండానే చెప్తున్నాయి. ఒకవేళ గోపాలానికి మాత్రం అవి అలాగు అగుపడుతున్నాయా? సూర్యుడి చిత్రాల్లో బోధించినా అగుపడదేం?

"ఈ చిత్రాలని ప్రదర్శనానికి పంపిస్తున్నా" అనే సూర్యుడి మాటలు వినబడ్డాయి. అతన్ని అభినందించి గోపాలం, రామనాథం బయట పడ్డారు.

"వాడిదొక మూర్ఖం" అన్నాడు రామనాథం చిన్నగా.

"అతను చెయ్యగలిగిన పనికూడా మనం చెయ్యలేకపోతూన్నాంగా? ఎవరి మూర్ఖం వాళ్లది. ఈ మూర్ఖం అంతా తెలివికలిగిన మానవులకు ఎక్కడిది?" అని అడిగాడు గోపాలం. రామ నాథం తన రూముకు వెళ్ళాడు.

గోపాలానికి ఏం తోచలేదు. ఎంతసేపు— ఎన్ని రోజులు—ఎన్ని సంవత్సరాలాలోచించేది జీవితాన్ని గురించి? మానవుడు పుట్టినప్పటినుంచి తన్ను గురించి ఆలోచించుకుంటున్నాడని తెలుసు కొని నవ్వుకొన్నాడు. సరియైన దోవ దొరకక ఒక తెర కప్పినట్లయింది. ఎన్నో బాటలు తెర వెనుక అగుపడుతున్నాయి. ఇంతకూ సరియైన బాట ఏదో?